**Sakshi**

# సుప్రీం తీర్పు మేర నడుచుకోండి

## గ్రూప్-1 తుది 'కీ' వ్యవహారంలో సర్వీస్ కమిషన్లకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2011లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి వివాదాస్పదమైన ఆరు ప్రశ్నలను పక్కనపెట్టి మిగిలిన 144 జవాబులనే పరిగణనలోకి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే నడుచుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లను హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చాక అదే వ్యవహారంపై తాము మరోసారి ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. 'కీ' లో తప్పుల విషయంలో జోక్యం చేసుకోవాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ బి.శివశంకరరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. 2011లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు సంబంధించి ఏపీపీఎస్సీ తుది 'కీ'లో ఆరు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయంటూ కొందరు అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ కేవలం నాలుగు ప్రశ్నల విషయంలోనే కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీపీఎస్సీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేయడంతో పాటు నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చేంత వరకు ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్వ్యూలను నిలిపేయాలని హైదరాబాద్‌కు చెందిన కె.ప్రసాద్, సి.హెచ్.నాగమురళీకృష్ణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, షెడ్యూల్ ప్రకారం ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్వ్యూలను యథాతథంగా కొనసాగించుకోవచ్చునని స్పష్టం చేసింది. అలాగే నిపుణుల కమిటీ నివేదికపై నిర్ణయం తీసుకునేంత వరకు ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థుల ఎంపికను ఖరారు చేయవద్దని ఏపీపీఎస్సీని ఆదేశించింది. అదే సమయంలో తుది 'కీ'లో వివాదాస్పదంగా మారిన డీ సీరీస్‌లోని 4 ప్రశ్నల విషయంలో ఏపీపీఎస్సీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదికపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.